# మనం
## కరీంనగర్
జగిత్యాల- రాజన్న సిరిసిల్ల- పెద్దపల్లి -మంచిర్యాల- కొమురంభీమ్

సోమవారం | 21 | ఆగస్టు | 2023 | పేజీలు : 7


డిసిసి కార్యాలయంలో ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి

7లో




# సిరిసిల్లలో కాంగ్రెస్ వర్గాల బాహాబాహి

- కుర్చీలతో కొట్టుకున్న నాయకులు

- తారా స్థాయికి చేరుకున్న వర్గ పోరు



రాజన్న సిరిసిల్ల, ఆగస్ట్ 20 (మనం న్యూస్): శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో సిరిసిల్ల కాంగ్రెస్‌లోని వర్గ పోరు మరోసారి బహిర్గతమైంది. ఎలాగైనా ఎన్నికల్లో గెలిచి, అధికారం చేపట్టాలని ఆ పార్టీ అధిష్టానం మల్లగుల్లాలు పడుతుంటే.. సిరిసిల్ల నియోజకవర్గంలోని కాంగ్రెస్ వర్గాలు మాత్రం ఆధిపత్యం కోసం బాహాబాహి తలపడుతున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం జరిగిన నియోజకవర్గ స్థాయి నేతల సమావేశంలో అంతర్గత విభేధాలు భగ్గుమన్నాయి. పార్టీ నియోజకవర్గ ఇంచార్జి కెకె.మహేందర్ రెడ్డి, మాజీ అధికార ప్రతినిధి చీటి ఉమేష్‌రావు

మిగతా 2లో..



## ఉద్యమకారులను విస్మరించిన బిఆర్ఎస్ ప్రభుత్వం

- ఎన్నికలు వస్తేనే అమరవీరులకు జోహార్లు అర్పిస్తున్నారు
- కెసిఆర్ కుడి, ఎడమల ఉన్నవారంతా తెలంగాణ ద్రోహులే..
- కాళేశ్వరం నీళ్లతో ఎన్ని ఎకరాలు పండించారు
- కెసిఆర్ మోసాలను ప్రజలు ఇప్పటికైనా గ్రహించాలి

: బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్

తిమ్మాపూర్, ఆగస్టు 20 (మనం న్యూస్): ప్రత్యేక రాష్ట్రం కోసం నిరంతరం పాటు పడిన ఉద్యమ కారులను, ప్రాణాలొదిన అమరవీరులను బిఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది.. ఎన్నికలు వస్తేనే కెసిఆర్ కుటుంబానికి అమర వీరులు గుర్తుకు వస్తున్నారు.. అప్పుడే జోహార్లు అర్పిస్తున్నారు.. అనంతరం పక్కన బెడుతున్నారు... టిఆర్ఎస్‌ను బిఆర్ఎస్‌గా మార్చిన క్షణమే తెలంగాణ పదాన్ని వారి డిక్షనరీల నుంచి తొలగించారు.. మహారాష్ట్రకు పోయి పోటీ చేస్తే డిపాజిట్లు కోల్పోయారు.. కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రంలో తెలంగాణ పాలన వస్తుందనుకుంటే, కెసిఆర్ కుటుంబ పాలనతో దివాళా తీయించిండు..

మిగతా 2లో..

# మున్సిపల్ చైర్ పర్సన్‌ను పరామర్శించిన మంత్రి గంగుల



హుజురాబాద్ రూరల్, ఆగస్టు 20 (మనం న్యూస్): హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గంధె రాధిక శ్రీనివాస్‌ల మామ సాంబయ్య ఇటీవల ప్రమాదవశాత్తు మరణించగా, వారి కుటుంబ సభ్యులను రాష్ట్ర పౌరసరఫరాలు, బిసి సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, కెడిసిసి బ్యాంకు ఉపాధ్యక్షులు పింగళి రమేష్, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వరరావు, బిఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాజీవ్ జయంతి వేడుకలు



కరీంనగర్, ఆగస్టు 20 (మనం న్యూస్): జిల్లా కాంగ్రెస్ బిసి సెల్ అధ్యక్షులు పులి ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో నగరంలో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భవిత వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశ భవిష్యత్తును ఆనాడే గుర్తెరిగి సాంకేతిక విప్లవాన్ని దేశంలోకి తీసుకొచ్చి ఈరోజు కంప్యూటర్, స్మార్ట్ ఫోన్‌లను ఆధునీకరించిన గొప్ప ప్రధాత రాజీవ్‌గాంధీ అన్నారు. యువతకు ఓటు హక్కుని 21 సం నుండి 18సం రాలకి మార్చిన ఘనత రాజీవ్‌దే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మాకర్ రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్, డీసీసీ ఉపాధ్యక్షులు మడుపు మోహన్, టీపీసీసీ ఆర్గనైసింగ్ సెక్రెటరీ రహమత్ హుస్సేన్, యూత్ కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ ప్రెసిడెంట్ రహమత్, కరీంనగర్ టౌన్ ఎస్ సి సెల్ ప్రెసిడెంట్ లింగంపల్లి బాబు, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి రామిడి రాజిరెడ్డి, జిల్లా నాయకులు నూనె గోపాల్ రెడ్డి, జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పాండ్రాల లింగమూర్తి,కొత్తపల్లి కిసాన్ సెల్ ప్రెసిడెంట్ నాగళ్ళ ప్రసాద్ పట్టణ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బుర్ర నాగరాజ్ గౌడ్ జిల్లా కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షులు కాలువల రాంచంద్రం,రామడుగు మండల చేనేత కాంగ్రెస్ ప్రెసిడెంట్ ఆడెపు రంగన్న, అంజయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బిసి సెల్ మండల అధ్యక్షుడిగా మేకల పోశం



సుల్తానాబాద్,ఆగస్టు 20 మనం న్యూస్ : కాంగ్రెస్ పార్టీ బిసి సెల్ మండల అధ్యక్షులుగా సుల్తానాబాద్ మండలం మియాపూర్ గ్రామానికి చెందిన మేకల పోషము ను నియమించినట్లు బిసి సెల్ జిల్లా అధ్యక్షులు పెండ్యాల మహేష్ తెలిపారు. మండలంలోని మియాపూర్ గ్రామానికి చెందిన పోషం గతంలో కాంగ్రెస్ పార్టీలో చురుకైన కార్యకర్తగా పనిచేశారని తెలిపారు. ఈ సందర్భంగా మేకల పోషం మాట్లాడుతూ మాజీ సర్పంచ్ గా పనిచేసిన అనుభవంతో మండలంలోని బిసిలను అందరిని ఏకతాటిపై తీసుకువస్తానని రానున్న రోజుల్లో బిసి లందరినీ ఏకం చేసి కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేసేలా పాటు పడతానని తెలిపారు.

# బిజెపిని రాష్ట్రంలో నిలువరించేందుకు..
# ప్రజాతంత్ర, లౌకిక వాదులు కమ్యూనిస్టులతో కలిసి పనిచేయాలి

## సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి



చిగురుమామిడి, ఆగస్టు 20 (మనం న్యూస్): అనేక కుట్రలు పన్ని తెలంగాణ రాష్ట్రంలో పాగా వేయాలని యత్నిస్తోన్న బిజెపి కుట్రలను నిలువరించాలంటే రాష్ట్రంలో ప్రజాతంత్ర, లౌకిక శక్తులు కమ్యూనిస్టులతో కలిసి పనిచేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు,మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలోని ముస్కు రాజిరెడ్డి స్మారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఐదు రాష్ట్రాల్లో జరగనున్న ఎన్నికల్లో మతోన్మాద, నియంతృత్వ బిజెపిని ఓడించెందుకు దేశ వ్యాప్తంగా లౌకిక,ప్రజాతంత్ర,సెక్యులర్ భావజాలం గల ప్రధాన ప్రతిపక్షాలన్నీ ఏకమవుతున్నాయన్నారు. జాతీయ రాజకీయాల్లో శరవేగంగా మార్పులు జరుగుతున్నాయని, వామపక్షాలు కీలక భూమిక పోషిస్తున్నాయని చాడ తెలిపారు. మునుగోడు ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ వామపక్షాల మద్దతు కోరిన నేపథ్యంలో ఆ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం పనిచేసామన్నారు. అక్కడ గెలవడం వల్ల రాష్ట్రంలో బిజెపి కొంత చతికిల పడ్డదని, దాన్ని కొనసాగింపు చేయాల్సిన అవసరం బిఆర్ఎస్ పై ఉందన్నారు. ఇప్పటికే తెలంగాణలో ఎన్నికల వాతావరణం వచ్చిందని, తామే అధికారంలోకి వస్తామని కాంగ్రెస్, ఎలాగైనా రాష్ట్రంలో పాగా వేయాలని బిజెపి చూస్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ 2018లో ప్రకటించిన రైతు రుణ మాఫీ ఒక లక్ష లోపు మాఫీ చేసినప్పటికీ, కొంత మంది రైతులకు ఋణ మాఫీ మెసేజ్ వచ్చిందని, బ్యాంక్ అధికారులు మాత్రం గతంలో రుణం చెల్లించిన వారికి రుణమాఫీ వర్తించదని పేర్కొంటున్నారన్నారు. ఈ విషయంలో రైతులు అయోమయానికి గురవుతున్నారని దానిపై ప్రభుత్వం స్పందించి వివరణ ఇవ్వాలని ముఖ్యమంత్రికి లేఖ కూడా రాసినట్టు చాడ వెంకటరెడ్డి తెలిపారు. ప్రజా సంక్షేమ పథకాల అమలులో జాప్యం జరుగుతోందని, పెన్షన్స్ అందరికి ఇవ్వడం లేదని, దళిత బంధు పథకం అసలైన అర్హులకు ఇవ్వాలని, గిరిజనులకు గిరిజన బంధు కూడా ఇవ్వాలని, కొత్త రేషన్ కార్డులు లేక అనేక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారని, కొత్తగా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గృహాలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకుందామంటే రేషన్ కార్డులు లేవని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తూ ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటిని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు అందె స్వామి, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, జిల్లా కౌన్సిల్ సభ్యులు అందె చిన్న స్వామి, చాడ శ్రీధర్ రెడ్డి, తేరాల సత్యనారాయణ, రాజయ్య, బూడిద సదాశివ, రైతు సంఘం మండల కన్వీనర్ కాంతాల శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ గోలి బాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్లలో కాంగ్రెస్ వర్గాల బాహాబాహి



మొదటి పేజీ తరువాయి..

వర్గాలు సమావేశం సాక్షిగా కుర్చీలతో పరస్పరం దాడులు చేసుకున్నారు. కెసిఆర్ మేనల్లుడు, కాంగ్రెస్ పార్టీ మాజీ అధికార ప్రతినిధి ఉమేష్‌రావు ఈ స్థానం నుంచి బరిలో నిలవాలని ఆశిస్తున్నారు. ఈ క్రమంలో గతంలో ఇక్కడ నుంచి పోటీ చేసి మరోసారి బరిలో నిలిచేందుకు సిద్ధమవుతున్న కెకె.మహేందర్‌రెడ్డికి మధ్య విభేదాలు తీవ్రమయ్యాయి. తాజాగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై కెకె.మహేందర్ రెడ్డి ఫోటో లేకపోవడం, ముస్తాబాద్ మండల అధ్యక్షుడికి తెలియకుండా ఉమేష్ రావు కొంత మందిని పార్టీలోకి ఆహ్వానించడం ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. దీంతో మాటమాటా పెరిగి ఇరువర్గాల నేతలు కుర్చీలతో పరస్పర దాడులు చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురికి స్వల్ప గాయాలు కాగా వారిని ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటన జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

# ఉద్యమకారులను విస్మరించిన బిఆర్ఎస్ ప్రభుత్వం



మొదటి పేజీ తరువాయి..

నీళ్ల నియామకాలన్నీ కెసిఆర్ కుటుంబానికే తప్ప రాష్ట్ర ప్రజలకు ఒరిగిందేమీ లేదు.. ఏ ప్రాంతానికి వెళ్లినా కెసినీళ్ల నియామకాలన్నీ కెసిఆర్ కుటుంబానికే తప్ప రాష్ట్ర ప్రజలకు ఒరిగిందేమీ లేదు.. ఏ ప్రాంతానికి వెళ్లినా కెసిఆర్, కెటిఆర్, హరీష్‌రావులు కాళేశ్వరం ప్రాజెక్టుతో ప్రజల కాళ్లు కడుగుతున్నామని చెబుతున్నారు.. అసలు ఇప్పటి వరకు ఎంత మంది కాళ్లు కడిగారో..? ఎన్ని ఎకరాల పంటలకు నీళ్లు అందించారో తేల్చాలి.. అసలు కాళేశ్వరం నీళ్ల వల్ల కెసిఆర్ ఫాంహౌస్‌కు మాత్రమే ప్రయోజనం కలుగుతోంది.. అని బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపి బండి సంజయ్ బిఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం ఇటీవల మరణించిన బిజెపి నాయకులు తుమ్మిశెట్టి మల్లయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. కరీంనగర్ జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆహ్వానం మేరకు తిమ్మాపూర్ మండల కేంద్రంలోని తెలంగాణ ఉద్యమ నాయకులు ఎడ్ల జోగి రెడ్డి నివాసంలో ఉద్యమకారులతో మర్యాదపూర్వక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్య మకారుల ఫోరం ఆధ్వర్యంలో ఎంపీ బండి సంజయ్ కుమార్ కు వినతి పత్రం సమర్పించి, ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కెసిఆర్ కుటుంబానికి అహంకారం ఎక్కువైందని, ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని వ్యతిరేకించిన ఎంఐఎంను కెసిఆర్ సంకనేసుకున్నాడని, ఆయనకు కుడి, ఎడమలుగా ఉన్న వారంతా ఉద్యమ ద్రోహులేనని వ్యాఖ్యానించారు. కెసిఆర్ కుటుంబ పాలనలో రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతోందని, ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తున్నారని విమర్శించారు. ఉద్యోగులు, నిరుద్యోగులు, రైతులు సహా అన్ని వర్గాలు కేసీఆర్ పాలనపై విసిగి రోడ్డెక్కుతున్నారన్నారు. వాళ్ళను భయపెట్టేందుకు పోలీసులను ఉపయోగించుకుని అరెస్టులు చేయిస్తూ లాఠీఛార్జ్ చేయిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నరని ఆరోపించారు. ఓట్లేయకుండా మీ సంగతి చూస్తా మని బెదిరించే స్థితికి దిగజారారన్నారు. ఇప్పటికైనా ప్రజలు కెసిఆర్ మోసాలను గ్రహించి, రాబోయే ఎన్నికల్లో తగిన రీతిలో బుద్ధి చెప్పాలని సంజయ్ పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమకారులకు బిజెపి నిత్యం అండగా ఉంటుందని హామీనిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా బిజెపి అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షులు కుమారస్వామి, మానకొండూరు నియోజ కవర్గం అధ్యక్షులు ఎడ్ల జోగి రెడ్డి, బిజెపి నాయకులు గడ్డం నాగరాజు, సుగుర్తి జగదీశ్వర చారి, ఉద్యమ నాయకులు స్వామి యాదవ్, మామిడి వెంకటయ్య, ఎడ్ల రాజిరెడ్డి, రామిరెడ్డి రాజిరెడ్డి, దొంగల కనకయ్య, పోలంపల్లి సదానందంతో పాటు పార్టీ శ్రేణులు, ఉద్యమకారులు పాల్గొన్నారు.

# ఆత్మ విశ్వాసంతో ప్రయత్నిస్తే సాధించందేమీలేదు

## చెన్నూరు కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజా రమేష్



మందమర్రి, ఆగస్టు 20 (మనం న్యూస్):ఆత్మవిశ్వాసంతో ప్రయత్నిస్తే సాధించినది అంటూ ఏమీ లేదని చెన్నూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ రాజా రమేష్ అన్నారు. ఆదివారం మందమర్రి పట్టణంలో నిర్వహించిన జాతీయ కరాటే, కుంగ్ ఫు చాంపియన్ షిప్ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిభ ఎవరి సొంతం కాదని, ఆత్మస్థైర్యంతో ముందుకు సాగితే విజయాలు సొంతం చేసుకోవచ్చన్నారు. ఆత్మ రక్షణకు నేర్చుకునే విద్యను కేవలం ఆపద సమయంలో, ప్రదర్శన సమయంలో మాత్రమే ఉపయోగించాలని సూచించారు. గురువుల విలువైన సమయాన్ని కేటాయించి నేర్పిస్తున్న విద్యను సద్వినియోగం చేసుకుని మంచి పేరు ప్రతిష్టలు పొందాలని ఆకాంక్షించారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి అందించే ప్రశంసాపత్రాలు భవిష్యత్‌లో ఎంతో ఉపయోగపడతాయని, వాటిని ఆధారంగా చేసుకుని ఉద్యోగాలు సాధించే అవకాశం వుంటుంది అని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థి దశలో వున్న పిల్లలకు చదువు పై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను ఎన్నుకోవాలని, లక్ష సాధనకు నిరంతరం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ చైర్మన్ బండారి సంతోష్, చీఫ్ ఆర్గనైజర్ కర్ర వెంకటేష్, ప్రెసిడెంట్ మోహన్, జనరల్ సెక్రటరీ భూమయ్య, రంగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడలో బిజెపి గెలుపుకు కృషి చేయాలి

## అస్సాం బిజెపి ఎమ్మెల్యే హేమంగ తాకురియా

వేములవాడ టౌన్, ఆగస్ట్ 20 (మనం న్యూస్): రానున్న శాసనసభ ఎన్నికల్లో వేములవాడ నియోజకవర్గంలో బిజెపి గెలుపు కోసం కృషి చేయాలని అస్సాం బిజెపి ఎమ్మెల్యే హేమంగ తాకురియా పిలుపునిచ్చారు. ఆదివారం వేములవాడ నియోజకవర్గంలోని బిజెపి మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర పార్టీ నిర్ధేశించిన విధంగా ఎనిమిది రోజుల ప్రణాళికపై అన్ని మండలాల అధ్యక్షులకు, నాయకులకు దిశానిర్దేశం చేశారు. ప్రతీ మండలానికి సంబంధించిన పార్టీ బూత్ కమిటీ శక్తి కేంద్రాలు, పార్టీ సంస్థాగత వ్యవహారాలు, వేములవాడ నియోజవర్గంలో బిజెపి గెలుపునకు కావలసిన పార్టీ నిర్ణయాలు, ప్రజా సమస్యలపై ఎనిమిది రోజుల పర్యటన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, అసెంబ్లీ కన్వీనర్ మార్తా సత్తయ్య, పార్లమెంట్ కో కన్వీనర్ దశరథ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ ఎర్రం మహేష్, అల్లాడి రమేష్, మాజీ ్కో చైర్పర్సన్ తుల ఉమ, వేములవాడ పట్టణ అధ్యక్షులు కౌన్సిలర్



రేగుల సంతోష్ బాబు ,అధికార ప్రతినిధి గొప్పు బాలరాజు, ముప్పిడి శ్రీనివాస్, మండలాల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శిలు పాల్గొన్నారు.

# బిసిలకు 60 శాతం టికెట్లు కేటాయించాలి

## బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర కో-ఆర్డినేటర్ రవిగౌడ్



సిరిసిల్ల అర్బన్, ఆగస్టు 20 (మనం న్యూస్): రాబోయే ఎన్నికల్లో అన్ని రాజకీయ పక్షాలు బిసిలకు 60 శాతం టికెట్లను కేటాయించడంతో పాటు బిసి ముఖ్యమంత్రిని ప్రకటించాలని బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర కో-ఆర్డినేటర్ కంచర్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం బిసి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ సిట్టింగ్‌లకు, గెలుపు గుర్రాల పేరిట బిజెపి, సర్వేల సాకుతో కాంగ్రెస్ పార్టీ అగ్రవర్ణాలకు టిక్కెట్లు కేటాయించే కుట్రలకు పాల్పడుతున్నాయని వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా అన్ని రాజకీయ పక్షాలు బిసిలకు 60 శాతం టికెట్లు కేటాయించాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా బిసిల సత్తా ఏంటో నిరూపిస్తామన్నారు. సెప్టెంబర్ 10వ తేదీన హైదరాబాదులో ఐదు లక్షల మందితో ఏర్పాటు చేయనున్న బిసి గర్జన సభ లోపే అన్ని పార్టీలు 60 శాతం టిక్కెట్లు కేటాయిస్తూ నిర్ణయం తీసుకోవాలని, లేని పక్షంలో బిసి రాజకీయ పార్టీ ప్రకటిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో బిసి విద్యార్థి సంఘం నాయకులు వంగ కృష్ణ గౌడ్, రాజేష్, పార్థు, నిశాంత్, వినయ్, అజయ్, హర్షవర్ధన్, ప్రణీత్ గౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమం కోసం కృషి చేసే ఏకైక పార్టీ కాంగ్రెస్

## జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్



వేములవాడ టౌన్, ఆగస్ట్ 20 (మనం న్యూస్): ప్రజల సంక్షేమం కోసం కృషి చేసే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం వేములవాడలో అసెంబ్లీ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, ఏఐసీసీ సెక్రటరీ క్రిష్టఫర్ తిలక్‌తో కలిసి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ బిజెపి, బిఆర్ఎస్‌లు కుమ్మక్కై ప్రజలను వంచిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రమిచ్చిందని, కానీ ఇప్పుడు నియంతృత్వ పాలనలో రాష్ట్రం అప్పులపాలైందని తెలిపారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పడానికి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. 10 సంవత్సరాల్లో బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అవినీతి పనులను ప్రజల ముందుకు తీసుకెళ్తామని, ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తామని శ్రీనివాస్ పేర్కొన్నారు.

# మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించిన జెఎస్సార్



చిగురుమామిడి, ఆగస్టు 20 (మనం న్యూస్): చిగురుమామిడి మండలం రేకొండ, బొమ్మనపల్లి గ్రామాల్లో ఇటీవల మరణించిన బైరి మల్లమ్మ, చట్ల హనుమంతు కుటుంబ సభ్యులను బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి, బిజెపి మండల అధ్యక్షులు దుడ్డెల లక్ష్మినారాయణలు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారి మృతికి కారణాలు తెలుసుకొని ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# సీనియర్ పాత్రికేయుడు రాధాకృష్ణ కుటుంబానికి ఆర్థిక సహాయం



మందమర్రి, ఆగస్టు 20 (మనం న్యూస్): ఇటీవల మృతి చెందిన సీనియర్ పాత్రికేయులు సెగ్గం రాధాకృష్ణ కుటుంబానికి ఆదివారం మందమర్రి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. రాధాకృష్ణ దశదినకర్మ సంతాప సభ కార్యక్రమంలో పాల్గొన్న ప్రెస్ క్లబ్ నాయకులు ఎనిమిది వేల రూపాయల నగదు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ సలాముద్దీన్, ప్రెస్ క్లబ్ ఇన్చార్జి సంతోష్ చారి, ఉపాధ్యక్షుడు తుల శ్రీనివాస్, కడారి శ్రీధర్, సురమళ్ళ శ్రీనివాస్, ఉప్పులేటి నరేష్, పల్లె సమ్మయ్య, జాడ క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన చాడ వెంకటరెడ్డి



చిగురుమామిడి, ఆగస్టు 20 (మనం న్యూస్): కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి, బొమ్మనపల్లి, గాగిరెడ్డిపల్లి గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను చాడ వెంకటరెడ్డి ఆదివారం పరామర్శించారు. బొమ్మనపల్లి గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు చట్ల హన్మంతు ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ హన్మంతు మృతి కుటుంబంతో పాటు పార్టీకి తీరని లోటన్నారు. హన్మంతు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం సుందరగిరి గ్రామంలోని బెడిగె వీరవ్వ, కాశవేని ఎంకవ్వ, గాగిరెడ్డిపల్లిలో ధారవేని అనూష, కాలువల రాజిరెడ్డి కుటుంబాలను పరామర్శించారు.

# సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్ట్

రాజన్న సిరిసిల్ల, ఆగస్ట్ 20 (మనం న్యూస్): తూర్పు గోదావరి కేంద్రంగా సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఇద్దరి వ్యక్తులను రాజన్న సిరిసిల్ల జిల్లా సైబర్ క్రైమ్ టీమ్, వేములవాడ పోలీసులు పట్టుకున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారి వివరాలు వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. ఆంధ్ర ప్రదేశ్ లోని తూర్పు గోదావరి జిల్లా రాజానగరంకు చెందిన సలాది రామ్ గోపాల్, గంగవరంకు చెందిన కోరుమేళ్లయి రాజ్ కుమార్‌లు సైబర్ నేరాలకు పాల్పడుతూ పలువురి అమాయకుల వద్ద నుంచి డబ్బులు కాజేసినట్లు తెలిపారు. రామ్‌గోపాల్ అనే వ్యక్తి బిటెక్ సివిల్ ఇంజనీర్ పూర్తి చేసి, ప్రస్తుతం లేబర్ కాంట్రాక్టర్ గా పని చేస్తూ, గత కొంత కాలంగా అమాయక ప్రజలను మోసం చేస్తున్నట్లు తెలిపారు. పేపర్ ప్రకటనల ద్వారా స్టాఫ్ నర్స్, ల్యాబ్ టెక్నీషియన్స్, ఫార్మాసిస్టులు కావాలని కెరీర్‌ఎన్హెచ్ఎం.గావ్.జీమేల్.కం అనే ఫేక్ మెయిల్ ఐడీ క్రియేట్ చేసి ప్రకటనలు పంపిస్తూ నిరుద్యోగులను మోసం చేస్తున్నట్లు



పేర్కొన్నారు. అతను ఇచ్చిన ప్రకటనలను నమ్మిన నిరుద్యోగ యువతి, యువకులు పంపిన బయోడాటాని పరిశీలించి, వారి మెయిల్ కి గాని, వాట్సప్ ద్వారా గాని అప్లికేషన్ పంపించి, త్వరలో ఇంటర్వ్యూ చేయనున్నట్లు సమాచారం పంపినట్లు తెలిపారు. రామ్ గోపాల్ సొంతంగా తయారు చేసిన నకిలీ అపాయింట్ మెంట్ జాబ్ లెటర్‌లను ఫేక్ మెయిల్ ద్వారా పంపుతూ జాబ్ కావాలంటే మొదటగా 50వేల రూపాయలు పంపించాలని కోరేవాడని ఎస్పీ వివరించారు. ఉద్యోగం వస్తుందన్న ఆశతో పలువురు యువతీ యువకులు ఫోన్ పే నంబర్లకు డబ్బులు పంపించారని తెలిపారు. దీంతో పాటుగా ఇంటర్వ్యూకు వచ్చిన వారి నుండి బ్యాంక్ పాస్ బుక్ లు, ఏటీమ్, ఆధార్ కార్డులను తీసుకున్నాడని పేర్కొన్నారు. ఈ తతంగం జరిపితే తన ఫోన్ నంబరుతో దొరికి పోతాననే జాగ్రత్తతో సిమ్ రిటేల్ విక్రేతలకు అధిక మొత్తం చెల్లించి ఇతరుల పేర్ల మీద సిమ్ నంబర్లను తీసుకుని లావాదేవీలు నిర్వహించాడని తెలిపారు. ఈ క్రమంలోనే వోఎల్ఎక్స్ లో రాంగోపాల్ పంపించిన ప్రకటన చూసిన ఆవుల లక్ష్మి ప్రియా అనే యువతి ఇంటర్వ్యూకి రాగా ఆమె వద్ద నుండి ఏటీమ్ కార్డ్ ను తీసుకొన్నాడన్నారు. అలాగే వేములవాడ పట్టణంలోని తిప్పాపురానికి చెందిన సునీతకి జిమెయిల్ కి ఆయుష్మాన్ భారత్‌లో పీఆర్వో పోస్ట్ ఉందని మెయిల్ చేసి, వివరాల కోసం 9515559446 నెంబర్ ని సంప్రదించాలని ప్రకటన సమాచారం ఇచ్చాడన్నారు. అది నమ్మిన సునీత ఆ నెంబర్ కి కాల్ చేసి నిందితుడితో మాట్లాడగా, దానికి కొంత డబ్బులు అవసరమని చెప్పి 2లక్షల85వేల రూపాయలు ఫోన్ పే చేయించుకున్నాడన్నారు. అనంతరం సదరు నిందితుడు డబ్బులు కానీ, ఉద్యోగం గాని ఇప్పించలేదన్నారు. సునీత మోసపోయినట్లు గ్రహించి ఏప్రిల్ నెలలో వేములవాడ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు మొదలు పెట్టామని ఎస్పీ తెలిపారు. ఇందులో భాగంగా జిలా సైబర్ క్రైమ్ ఆర్ఎస్ఐ జునైద్, సిబ్బంది, వేములవాడ పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టారన్నారు. ఇద్దరు నిందితులు



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందినవారుగా గుర్తించి, ఆంధ్రప్రదేశ్ కి వెళ్లిన స్పెషల్ టీమ్ సాంకేతికత ఆధారంగా నిందితులు వేములవాడలో సంచరిస్తున్నారని గ్రహించింది. అనంతరం వారిని రాజన్న గుడి సమీపంలో అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుండి లక్షా60వేల రూపాయల నగదు, ఒక కారు, సిమ్ కార్డులు, మూడు మొబైల్ ఫోన్‌లు, ఆరు బ్యాంక్ పాస్ పుస్తకాలు, నాలుగు ఏటీఎం కార్డులు, 163 సిమ్ కార్డులు, ఏడు చెక్ బుక్కులను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కి తరలించినట్టు వివరించారు. రాంగోపాల్ పై దేశవ్యాప్తంగా 1,351, తెలంగాణ వ్యాప్తంగా 257 పిర్యాదులు రాగా, దేశవ్యాప్తంగా 65 కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. గతంలో 12 కేసులలో జైల్ శిక్ష అనుభవించడం జరిగిందన్నారు. కేసు ఛేదించిన రాజన్న సిరిసిల్ల సైబర్ క్రైమ్ ఆర్ఎస్ఐ జునైద్, రాజాతిరుమలేష్, వేములవాడ టౌన్ ఎస్ఐ రమేష్, రజినీకాంత్ లను జిల్లాఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, క్యాష్ రివార్డ్స్ అందజేశారు. ఈ సమావేశంలో టౌన్ సిఐ కరుణాకర్, ఎస్ఐలు జునైద్, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## దేశానికి రాజీవ్‌గాంధీ చేసిన సేవలు మరువలేనివి



వీణవంక-ఆగష్టు 20 (మనం న్యూస్): భారతదేశానికి మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్‌గాంధీ చేసిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహమ్మద్ సాహెబ్‌హుస్సేన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా సాహెబ్ హుస్సేన్ మాట్లాడుతూ దేశం కోసం ఇందిరాగాంధీ ,రాజీవ్‌గాంధీ లు ప్రాణాలు అర్పించారని, సాంకేతిక విప్లవాన్ని దేశంలో ప్రవేశపెట్టిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కుతుందన్నారు. ఓటుహక్కు వయస్సును 21 సంవత్సరాల నుండి 18 సంవత్సరాలకు తగ్గించి యువత ఓటుహక్కును వినియోగించుకునేలా అవకాశం కల్పించారన్నారు. బడుగు బలహీన వర్గాల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత కాంగ్రెస్‌పార్టీదేనని కొనియాడారు.దేశసమగ్రత రాజీవ్ అడుగు జాడల్లో మనందరం పయనించి కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలో,దేశంలో ప్రజల ఆశీర్వాదంతో ఏర్పాటు కావడానికి మనమందరం కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గంగాడి రాజిరెడ్డి, కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చదువు జైపాల్‌రెడ్డి, నాయకులు జున్నూతుల మధుకర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రజాక్, అన్వర గట్టయ్య, శబరీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాజీవ్ వర్ధంతి

చిగురుమామిడి, ఆగస్టు 20 (మనం న్యూస్)ః కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కంది తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ జయంతి కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చిట్టమల్ల రవీందర్, అధికార ప్రతినిధులు ఐరెడ్డి సత్యనారాయణ రెడ్డి, దాసరి ప్రవీణ్ కుమార్, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి బోయిని నరేష్, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు భారతీదేవి, మైనార్టీ సెల్ అధ్యక్షులు సాబుద్దీన్, బొమ్మనపల్లి సీనియర్ నాయకులు తిరుమలరెడ్డి, కరివేద ఈశ్వర్ రెడ్డి, వంగాల రాజి రెడ్డి, చిగురుమామిడి గ్రామ సీనియర్ నాయకులు కవ్వంపల్లి సంజీవ్, బాలకృష్ణమాచారి, గందె రాజయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు జిల్లాల రమేష్, ఎనగందుల శివకుమార్, గాగిరెడ్డిపల్లి యూత్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బొమ్మగాని రాజా గౌడ్, కూన రాజకుమార్, తదితరులు పాల్గొన్నారు.



## ఎండపల్లి మండల ఆటో యూనియన్ నూతన కార్యవర్గం



వెల్గటూర్, ఆగస్టు 20 (మనం న్యూస్): ఎండపల్లి మండల ఆటో యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం మండల కేంద్రంలోని పెద్దమ్మతల్లి ఆలయ ఆవరణలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ అధ్యక్షులుగా ఎండపల్లి మండల కేంద్రానికి చెందిన సంపతి సతీష్, ప్రధాన కార్యదర్శులుగా ఉడుత రవి, బొంగాని తిరుపతి, ఉపాధ్యక్షులుగా పొన్నం లక్ష్మన్, కోశాధికారులుగా తిరుమల సతీష్, ఉప్పులేటి మారుతి, సహాయ కార్యదర్శిగా బొమ్మగాని అశోక్, చెరుకురి అనిల్, రూట్ డైరెక్టర్‌లుగా బూసారపు కృష్ణ, కనుకుంట్ల శ్రీనివాస్, సలహాదారుగా మార కుమార్, ప్రచార కార్యదర్శిగా గూడ రాజేశంలను సభ్యులు ఏకగ్రీవం గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.

# ప్రజలు బిజెపి పాలన కోరుకుంటున్నారు

## అస్సాం ఎమ్మెల్యే దిగంత కలిత

తిమ్మాపూర్, ఆగస్టు 20 (మనం న్యూస్)ః రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం పట్ల తీవ్ర వ్యతిరేకత ఉందని, ఇన్నేళ్లుగా కుటుంబ సభ్యుల అభివృద్ధి కోసమే పనిచేసిన కెసిఆర్ ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరిస్తూ, మోదీ నాయకత్వంలోని బిజెపి పాలన కోరుకుంటున్నారని అస్సాం రాష్ట్ర కమల్పూర్ ఎంఎల్ఏ దిగంత కలిత పేర్కొన్నారు. ఆదివారం ఎంఎల్ఏ ప్రవాస్ యోజన అభియాన్ కార్యక్రమంలో భాగంగా మానకొండూర్ నియోజకవర్గానికి ఇంచార్జిగా విచ్చేసిన ఆయన అల్గునూర్ లోని ప్రవేట్ ఫంక్షన్ హాల్లో నియోజకవర్గ ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో బిజెపికి బలమైన ఓటు బ్యాంకు ఉందన్నారు. గతంలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో బిజెపికి ఆరువేల ఓట్లు వస్తే, లోక్ సభ ఎన్నికల నాటికి 70వేల ఓట్లు రావడం గొప్ప విషయమన్నారు. నియోజక వర్గంలో పార్టీకి ఓట్లు వేసేవారు వేల సంఖ్యలో ఉన్నారనేది దీంతో స్పష్టమైందన్నారు. భారతీయ జనతా పార్టీని నియోజకవర్గంలో మరింత పటిష్టం చేయడానికి కేంద్ర రాష్ట్ర నాయకత్వం ఆలోచన చేస్తుందని, అందులో భాగంగానే తన పర్యటన వారం రోజులపాటు నియోజకవర్గంలో ఉంటుందని చెప్పా రు. రాబోయే ఎన్నికల్లో బిజెపి శక్తి చాటాలని, నియోజకవర్గంలో కాషాయ జెండా ఎగరవేయడానికి నాయకులు కార్యకర్తలు అంతా సమిష్టి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు మెంబర్ దరువు ఎల్లన్న, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి, కరీంనగర్ జిల్లా ఉపా ధ్యక్షులు మాడ వెంకట రెడ్డి, సిద్దిపేట జిల్లా కిషన్ మోర్చా అధ్యక్షులు దాచారం ఎంపీటీసీ రాజు, కరీంనగర్ జిల్లా అధికార ప్రతినిధులు సమ్మి రెడ్డి బొంతల కళ్యాణ్ చంద్ర, కరీంనగర్ జిల్లా కార్యవర్గ సభ్యులు, రాజి



రెడ్డి ,అప్పాని తిరుపతి, దూలం కిరణ్ గౌడ్, మావురపు సంపత్,జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు మియాపురం లక్ష్మణా చారి, సీనియర్ నాయకులు గడ్డం నాగరాజు,సొల్లు అజయ్ వర్మ, మానకొండూరు మండల అధ్యక్షుడు రాపాక ప్రవీణ్, బెజ్జంకి మండల అధ్యక్షులు ధోనె అశోక్,గన్నేరువరం మండల అధ్యక్షులు నగునూరి శంకర్,ఇల్లంతకుంట మండల అధ్యక్షుడు నాగసముద్రాల సంతోష్, మానకొండూరు మండల ప్రధాన కార్యదర్శి వంగల ఆంజనేయులు సొన్నాకుల శ్రీనివాస్, శంకరపట్నం మండల ప్రధాన కార్యదర్శి దాసారపు నరేందర్, మండలాల ఉపాధ్యక్షులు, మోర్చాల అధ్యక్షులు, నాయకులు ప్రజా ప్రతినిధులు, మండలాల సోషల్ మీడియా కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో
# ఘనంగా రాజీవ్ జయంతి



కరీంనగర్, ఆగస్టు 20 (మనం న్యూస్)ః నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని రాజీవ్ చౌక్ వద్ద గల రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ సాంకేతిక రంగానికి బీజం వేసి యువతకు పద్దెనిమిది సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించిన ఘనత రాజీవ్ గాంధీదే అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం నిరంతరం కంకణ బద్దులమై పని చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిసిసి కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్, నాయకులు మాచర్ల ప్రసాద్, దన్న సింగ్, ఎండి.తాజ్, శ్రవణ్ నాయక్, షబానా మహమ్మద్, ముల్కల కవిత, శకుంతల, ఎగ్గడి శారద, లింగంపల్లి బాబు, కుర్ర పోచయ్య,దండి రవీందర్, జీడి రమేష్, ఖంరొద్దిన్, అబ్దుల్ రెహ్మాన్, ముక్క భాస్కర్, పొరండ్ల రమేష్, లయాక్, సలీమొద్దిన్, మహమ్మద్ భారీ, సిరాజొద్దిన్, నీహాల్ అహ్మద్, సుంకరి గణపతి, వంగల విద్యా సాగర్, నాగుల సతీష్, ఇమామ్, అజ్మత్, రాజ్ కుమార్, బషీర్, ఖలీల్, దిలీప్ కుమార్, కీర్తి కుమార్, తమ్మడి ఎజ్రా, హనీఫ్, ముల్కల యోనా, సోహెల్ తదితరులు పాల్గొన్నారు.

# పత్రాలు సరిగ్గా లేకుంటే అమెరికాకు ఎలా వెళ్లారు.?

## తెలుగు విద్యార్థులను వెనక్కిపంపడంహేయమైన చర్య



వీణవంక- ఆగష్టు 20(మనం న్యూస్): ఇంజనీరింగ్ విద్యను ఎంతో కష్టపడి చదివి అత్యుత్తమ ఫలితాలను సాధించి దేశంలో లక్షలాదిమంది విద్యార్థులతో పోటీ పడి ఇంటర్వ్యూనెగ్గి అమెరికాలో గుర్తింపు పొందిన ఉత్తమ విశ్వవిద్యాలయాల్లో సీటు పొందిన 21మంది తెలుగు విద్యార్థినీ విద్యార్థులను అమెరికా విదేశీ వ్యవహారాల శాఖ అధికారులు స్వదేశానికి తిరిగి పంపడం దారుణమైన చర్య అని మండలంలోని హిమ్మత్‌నగర్, కొండపాక గ్రామాల ఎంపీటీసీ నల్ల మమత తిరుపతిరెడ్డి అన్నారు. శనివారం హిమ్మత్‌నగర్ గ్రామంలో ఆయన మాట్లాడుతూ అమెరికాకు ఉన్నత విద్యకై ఇటీవల తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు వెళ్లగా అక్కడ చికాగో,శాన్‌ఫ్రాన్సిస్కో,అట్లాంట విమానాశ్రయాలలో అక్కడి విదేశీవ్యవహారాలశాఖ అధికారులు ఇమిగ్రేషన్ పత్రాలు సరిగ్గాలేవని విద్యార్థులను దాదాపు 30 గంటల పాటు నిర్బంధించి మానసిక ఒత్తిడికి గురి చేసి తిరిగి భారత్‌కు పంపడం అత్యంత దుర్మార్గమైన చర్య అని అన్నారు.కన్సెల్టెన్సీ లు అందజేసిన పత్రాల తో పాటు విద్యార్హత పత్రాలు ,వైద్య దృవీకరణ పత్రాలు ఉన్నా కూడా ఇలాంటి దుందుడుకు చర్యలు అమెరికా అధికారులకు తగదని ఒకవేళ విద్యార్థులకు సరైనా పత్రాలే లేకుంటే అక్కడి వరకు ఎలా వెళ్లారని ప్రశ్నించారు. ఈ విషయమై భారత వీదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ స్పందించి అమెరికా రాయబార అధికారులతో చర్చించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

# సూర్జీత్ భవన్‌పై పోలీసుల దాడి ఎమర్జెన్సీని తలపిస్తుంది

## సిపిఎం జిల్లా కార్యదర్శి వాసుదేవ రెడ్డి



కరీంనగర్, ఆగస్టు 20 (మనం న్యూస్)ః ఢిల్లీ పోలీసుల అత్యుత్సాహంతో హరికిషన్ సింగ్ సుర్జిత్ భవనంలో వి20 సమ్మిట్ జరగకుండా గేటు తాళాలు వేసి లోపల ఉన్నవారు వెళ్ళిపోవాలని హెచ్చరిక జారీ చేయడం ఎమర్జెన్సీని తలపిస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారీ సంఖ్యలో పోలీసులు, భద్రతా బలగాలు హరికిషన్ సింగ్ సుర్జీత్ భవన్‌ను చుట్టుముట్టి, ప్రధాన గేటుకు తాళం వేసి, సదస్సు రద్దయ్యిందని బోర్డు పెట్టడం దారుణమన్నారు. మోడీ హయాంలో ప్రజాస్వామ్యం ఎలా ఉందో ఈ సంఘటన స్పష్టం చేస్తుందని పేర్కొన్నారు. ఇండోర్ హాల్లో ప్రజా స్వామ్యయుతంగా సమావేశాలు నిర్వహించు కుంటుంటే ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బంది ఏంటని ప్రశ్నించారు. ఎ20సదస్సు నిర్వహణ పేరుతో కేంద్ర ప్రభుత్వం పేదల్ని, పేదల ఇండ్లనూ బుల్డోజర్లతో నిర్దాక్షిణ్యంగా తొలగిస్తుందని ఆరోపించారు. కొందరు వ్యక్తులు గుమికూడితేనే ప్రధాని మోడీ ఎందుకు భయ పడుతున్నారని వాసుదేవరెడ్డి ప్రశ్నించారు. దేశంలో ప్రాథమిక మాన వ హక్కులు, పర్యా వరణం, జీవవైవిధ్యం, గోప్యత సహా అన్ని రక్షణ చట్టాలకు అర్థం లేకుండా పోయిందని పేర్కొ న్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్ని ంచే సాహసం చేస్తే కఠిన చట్టాల కింద కల్పిత కేసులు పెట్టి, క్రిమి నల్ విచారణల్లో ఇరికిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసుల నిరంకుశ చర్యను వామపక్ష,ప్రజాస్వామ్య, ప్రగతిశీల, అభ్యుదయ, మేధావి వర్గాలు తీవ్రంగా ఖండించాలని కోరారు. రాజధానిలో చర్చలు, సెమినార్లు నిర్వహించుకునేందుకు పౌరులకు గల ప్రజాస్వామ్య హక్కులో ఢిల్లీ పోలీసుల ద్వారా జోక్యం చేసుకునే ప్రయత్నాలను మోడీ ప్రభుత్వం తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు.

# ఆర్థిక సహాయం అందజేసిన ఉదయ్‌నందన్‌రెడ్డి



వీణవంక-ఆగష్టు 20(మనం న్యూస్): మండలంలోని లక్ష్మక్కపల్లి గ్రామానికి చెందిన ఉడుత కొమురమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది.సమాచారం తెలుసుకున్న యూప్‌టీవి అధినేత పాడి ఉదయ్‌నందన్‌రెడ్డి ఆదివారం మృతురాలి కుటుంబానికి ప్రగాఢసా ను భూతిని వ్యక్తం చేసి తన అనుచరులతో ఐదువేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యులు అబ్దుల్‌హమీద్,వీణవంక గ్రామ మాజీ సర్పంచ్ చిన్నాల ఐలయ్య యాదవ్, మాజీ ఉపసర్పంచ్ మేకల సమ్మిరెడ్డి, మర్రి రవి, మధు, సమ్మయ్య, చేరాలు, లోకేష్,అమృత ప్రభాకర్, చిట్టి,కొమురయ్య, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ నియోజకవర్గ బిజెపి కో-ఆర్డినేటర్లుగా బాస, గుగ్గిల్లపు

కరీంనగర్, ఆగస్టు 20 (మనం న్యూస్)ః భారతీయ జనతా పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్లుగా బాస సత్యనారాయణరావు, గుగ్గిలపు రమేష్‌లు నియమితులయ్యారు. ఈ మేరకు బిజెపి





జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణా రెడ్డి ఆది వారం సాయంత్రం నియామకపు ఉత్తర్వుల జారీ చేశారు. కరీంనగర్ అసెంబ్లీ పరిధిలో పార్టీ సంస్థాగత నిర్మాణం, అభివృద్ధి కొరకు కృషి చేసి, రాబోయే ఎన్నికల్లో కరీంనగర్ బిజెపి అసెంబ్లీ అభ్యర్థి గెలుపు కొరకు బాస సత్యనారాయణ రావు, గుగ్గిల్లపు రమేష్ లు కృషి చేయాలని కోరారు.

# వలస కూలీల సమక్షంలో జన్మదిన వేడుకలు



కొత్తపల్లి, ఆగస్టు 20 (మనం న్యూస్)ః సంగారెడ్డి జిల్లా నారాయణ్‌ఖేడ్ నియోజకవర్గ కురుమ సంఘం అధ్యక్షులు ప్రభాకర్ జన్మదిన వేడుకలను కొత్తపల్లిలోని రాజస్థాన్ నుండి వచ్చిన వలస కార్మికుల మధ్యలో ఆదివారం జరుపుకున్నారు. రైతు సంఘం నాయకులు చిట్కూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి పండ్లు, బిస్కెట్లు, పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి పట్టణ నాయకులు పెంటి రాజమౌళి, రుద్రపరం, పెంటి శ్రీకాంత్, స్వర్గం మనోజ్, పోచమల్లు, దాసరి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నప్పటి నుండి ప్రేమించానని నమ్మించి..

# నట్టేట్లో ముంచాడు



ముత్తారం,ఆగస్టు 20 మనం న్యూస్ : తాము చిన్నప్పటినుండి ప్రేమించుకుంటున్నామని..నిన్నే ప్రేమిస్తున్నామని నమ్మించి తనకు పెళ్లి అయినాక కూడా భర్తకు విడాకులు ఇస్తే..నిన్నే పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో తన భర్తకు విడాకులు ఇచ్చి పెళ్లి చేసుకోమంటే ప్రియుడు మోహం చాటే చేయడంతో నమ్మి మోసపోయిన ఓ ప్రేమికురాలు తన ప్రియుడి ఇంటి ముందు విహార దీక్ష చేస్తున్న ఘటన పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని రామకృష్ణాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. బాధితురాలు కథనం ప్రకారం అదే గ్రామానికి చెందిన జనగామ విద్యాసాగర్‌తో చిప్పకుర్తి రజిత చిన్ననాటి నుంచే ఒకరినోకరు ఇష్టపడి ప్రేమించుకుంటున్నారు. కానీ రజిత తల్లిదండ్రులు రజితకు వేరు ఒక అబ్బాయితో పెళ్లి చేయగా విద్యాసాగర్ రజితను ప్రేమిస్తున్నానని నీ భర్తకు విడాకులు ఇస్తే నిన్ను పెళ్లి చేసుకుంటానని నమ్మబలకడంతో ఎలాగో ప్రేమించుకున్నాము కదా.. అని రజిత పెళ్లి చేసుకున్న భర్తకు విడాకులు ఇచ్చి ఇంటి వాద్దే ఉంటుంది. విద్యాసాగర్‌కు తనను పెళ్లి చేసుకోమని అడగగా మా చెల్లె పెళ్లి కానీ..నాకు ఉద్యోగం పర్మనెంట్ కానీ ఆ తర్వాత చేసుకుంటాను అంటూ రజితను నమ్మిస్తూ వచ్చాడు. తీరా ఇప్పుడు అమ్మాయి పెళ్లి చేసుకోమని ఒత్తిడి చేయడంతో విద్యాసాగర్ చేతులెత్తేశాడు. నీవు ఇంకొక్కర్ని ఎవరినైనా పెళ్లి చేసుకో..నీ దారి నువ్వు చూసుకో.. నా దారి నేను చూసుకుంటా అంటూ విద్యాసాగర్ తెగేసి చెప్పడంతో షాక్కు గురైన రజిత చేసేది లేక ఆదివారం గ్రామంలోని విద్యాసాగర్ ఇంటి ముందు తనను పెళ్లి చేసుకోవాలని నిరాహార దీక్ష చేస్తుంది. విద్యాసాగరతో పెళ్లి జరిపించే వరకు దీక్ష విరమించేది లేదని రజిత కారకాండిగా చెబుతుంది. లేకుంటే తనకు చావే శరణ్యమని రజిత రోధిస్తుంది. విషయం తెలుసుకున్న ముత్తారం పోలీసులు రంగ ప్రవేశం చేసి రజితతో మాట్లాడుతున్నారు.

## ఖర్గే ను కలిసిన కవ్వంపల్లి సత్యనారాయణ



కరీంనగర్, ఆగస్టు 20 (మనం న్యూస్)ః ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గేను ఢిల్లీలోని ఎఐసిసి కార్యాలయంలో కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణ ఆదివారం కలిసారు. ఎఐసిసి కార్యాలయంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర ఎస్సీ రిజర్వ్డ్ అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్ పార్టీల జిల్లా అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా త్వరలో చేవెళ్లలో జరుగనున్న కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభలో ప్రవేశపెట్టనున్న ఎస్సీ డిక్లరేషన్ లో పొందుపరుచాల్సిన అంశాలతో కూడిన ఒక నివేదికను సీఎల్పీ నాయకులు బట్టి విక్రమార్కతో కలిసి మల్లిఖార్జున్ ఖర్గేకు అందజేశారు. ఈ సమావేశంలో ములుగు శాసన సభ్యురాలు సీతక్క, టిపిసిసి ఎస్సీ సెల్ అధ్యక్షులు ప్రీతం నగరి, జగిత్యాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అడ్లూరు లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎవరు పోటీ చేసినా గెలిపించాలి

### జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్



జగిత్యాల, ఆగస్టు 20 (మనం న్యూస్)ః రాబోయే శాసనసభ ఎన్నికల్లో జగిత్యాల నియోజకవర్గం నుంచి ఎవరు పోటీ చేసినా గెలిపించాలని శాసనసభ్యులు డాక్టర్ సంజయ్‌కుమార్ వ్యాఖ్యానించారు. ఎన్నికలు ఇప్పుడే లేవని దానికి మరి కొంత సమయం ఉందని అయితే వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో ఎమ్మెల్యేగా ఎవరు పోటీ చేస్తారనేది ఇంకా క్లారిటీ లేదన్నారు. బిఆర్ఎస్ పార్టీ నుండి తాను పోటీలో లేకపోయినా ఎవరు పోటీ చేసినా గెలిపించాలని ప్రజలను కోరారు. పలు అభివృద్ధి కార్యక్రమాల కోసం పట్టణంలోని 10వ వార్డులో పర్యటించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుండి ఎమ్మెల్సీ కవిత సహకారంతో జగిత్యాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశానన్నారు. ప్రజలకు ఇవ్వని ఎన్నో హామీలను సైతం బిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిందని గుర్తు చేసారు. అయితే బిఆర్ఎస్ పార్టీ రేపో మాపో ఎమ్మెల్యే అభ్యర్థుల లిస్ట్ విడుదల చేసే అవకాశమున్న నేపథ్యంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడిన మాటలు జగిత్యాల లో హాట్ టాపిక్ గా మారాయి.

## పద్మశాలి యువజన సంఘం ప్రమాణ స్వీకారం



కొత్తపల్లి, ఆగస్టు 20 (మనం న్యూస్)ః కొత్తపల్లి పద్మశాలి యువజన సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులుగా వేముల సాగర్‌తో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కార్యవర్గాన్ని రైతు సంఘం నాయకుడు చిట్యాకి శ్రీనివాస్ శాలువాతో సన్మానించారు. చేయడం జరిగింది. ఈ సందర్భంగా కొత్తపల్లి మార్కండేయ గుడి అభివృద్ధి కొరకు చిట్యాకి శ్రీనివాస్ ఐదువేల రూపాయలు విరాళం అందించగా పద్మశాలి సంఘం తరఫున సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, మాజీ ఎంపిపి వాసాల రమేష్, గుడి కమిటీ చైర్మన్ అనుమల్ల సత్యనారాయణ, కముటం రాజేశం, స్వర్గం నర్సయ్య, వేముల చంద్రశేఖర్, సుంకే సత్యం, కట్ల సుధాకర్, రుద్ర పరం, పేంటీ శ్రీకాంత్, శేఖర్, పద్మశాలి సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు



ఇల్లందకుంట, ఆగస్టు 20 (మనం న్యూస్)ః మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు కనుమల్ల సంపత్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. సిరిసేడు గ్రామంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వంగ రామకృష్ణ, గడ్డివానిపల్లిలో గడ్డి శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, భోగం సాయి, మర్రి వీరారెడ్డి, మేకల సురేష్, మానసాని రవి, గుండారం సాయికుమార్, జలంధర్ రెడ్డి, సందీప్ రెడ్డి, పెద్ది శివ, పరమేష్, దంసాని కిరణ్, భోగం సాయి, మారపల్లి వేణు, సురేష్, అన్వేష్, లక్ష్మణ్, దినేష్, చిరంజీవి, దామోదర్ రాజు తదితరులు పాల్గొన్నారు.





## మా జీవనోపాధిని రైస్‌మిల్ యజమానులు దెబ్బతీస్తున్నారు

సుల్తానాబాద్,ఆగస్టు 20 మనం న్యూస్ : సుల్తానాబాద్ పట్టణంలోని కెనాల్ వద్ద ఆదివారం లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో 5 వ రోజు నిరసన దీక్ష కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా లారీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మంచిరెడ్డి రాజేందర్‌రెడ్డి హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి,ఫయాజ్ మాట్లాడుతూ సుల్తానాబాద్ రైస్‌మిల్ అసోసియేషన్ వారు స్థానిక లారీ మజమానులకు కిరాయిలు ఇవ్వకుండా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన లారీలకు ప్రాముఖ్యతనిస్తూ ఆ లారీల ద్వారా రవాణా చేయడాన్ని వ్యతిరేకిస్తూ,సుల్తానాబాద్ లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత ఐదు రోజులుగా చేస్తున్న దీక్షకు మద్దతు తెలుపుతున్నామన్నారు. ఆనాడు ఉద్యమ నాయకుడు కేసిఆర్ చేపట్టిన తెలంగాణ ఉద్యమంలో సైతం మేము చురుగ్గా పాల్గొని ఆర్థికంగా నష్టపోయామని,అలాంటి మా పొట్ట కొట్టి మమ్మల్ని ఇబ్బందులకు గురిచూస్తూ,మా జీవనోపాధిని సుల్తానాబాద్ రైస్ మిల్ యజమానులు దెబ్బతీస్తున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే మరియు ప్రతిపక్ష నాయకులందరూ మా లారీ అసోసియేషన్ కి మద్దతు తెలిపి,మా సమస్యను పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. ఇప్పటికైనా సుల్తానాబాద్ రైస్మిల్ యాజమాన్యం స్థానిక లారీలను రవాణా కోసం వాడాలని,లేనిపక్షంలో రాష్ట్ర స్థాయిలో సైతం పెద్ద మొత్తంలో ఉద్యమం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కోయ్యాడ సుధాకర్‌గౌడ్,మంచిర్యాల లారీ అసోసియేషన్ అధ్యక్షులు ఎండి ఫయాజ్,సుల్తానాబాద్ లారీ అసోసియేషణ్ అధ్యక్షులు కంకణాల తరిఉపతి,గుర్రాల శ్రీనివాస్,నగునూరి నాగరాజు,కనివేని సతీష్,ములుగురి శ్యామ్, రమేష్ రావు, రాజిరెడ్డి,పల్లర్ల సంపత్,రౌతు రవి, నాగరాజు, శేఖర్, సతీష్, శివ, కుమార్, వినోద్, హాకీం,తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే రమేష్ బాబుకు బిఆర్ఎస్ ప్రజాప్రతినిధుల మద్దతు

## టిక్కెట్ ఆయనకే ఇవ్వాలని విన్నపం

వేములవాడ టౌన్, ఆగస్టు 20 (మనం న్యూస్): వేములవాడ ఎమ్మెల్యే రమేష్ బాబుకు నియోజకవర్గ స్థాయి బిఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు ఆదివారం సంపూర్ణ మద్ధతు పలికారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ సిఎం కెసిఆర్ సిట్టింగ్ ఎమ్మెల్యేలకే సీటు కేటాయిస్తామని చెప్పిన మాట ప్రకారం ఎమ్మెల్యే రమేష్ బాబుకే సీటు ఇవ్వాలని విన్నవించారు. అన్ని సర్వేలు, ప్రజాభిప్రాయంలో రమేష్ బాబే గెలుపు వరుసలో ముందున్నారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సత్తిరెడ్డి, పుల్కం రాజు, గోస్కుల రవి, మల్యాల దేవయ్య, మేకల ఎల్లయ్య, దయాల కమలాకర్, మున్సిపల్ చైర్మన్ రామతీర్థం మాధవి రాజు, జడ్పిటిసిలు జగిత్యాల జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్ రావు, నాగం భూమయ్య, గట్ల మీనయ్య, మేకల రవి, యాస వాణి, ఎంపీపీలు జవ్వాజి రేవతి, గంగం స్వరూప మహేష్, బూర వజ్రావ్వ, ఎదురుగట్ల చంద్రయ్య గౌడ్, బైరగొని లావణ్య రమేష్, కౌన్సిలర్లు జయ సలీం, జోగిని శంకర్, జెడల లక్ష్మి శ్రీనివాస్, కంకనాల శ్రీలత క్రాంతి, మారం కుమార్, కొండ కనకయ్య, సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, సెస్ డైరెక్టర్లు ఆకుల గంగారం, పొన్నాల శ్రీనివాస్, ఆకుల దేవరాజం, నామాల ఉమా లక్ష్మీ రాజం, మార్కెట్ కమిటీ చైర్మన్లు ఉద్గిరీ రమ్య ఆది రెడ్డి, గుందారపు సౌజన్య గంగాధర్, ఏనుగుల శ్రీనివాస్, వైస్ చైర్మన్లు కొప్పెర లింగారెడ్డి, వెల్మ బాల్ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్లు గడ్డం హనుమాన్లు, డప్పులఅశోక్, వర్ధినేని నాగేశ్వరరావు, మండల వైస్ ఎంపీపీలు డి శ్రీనివాస్, వి సుమలత, జీ కిరణ్ రావు, ప్యాక్స్ చైర్మన్లు రమేష్ రెడ్డి, తిప్పని శ్రీనివాస్, రేగులపాటి కృష్ణ దేవ రావు, సల్మాన్ రెడ్డి, కథలాపూర్ మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు ఎంజీ రెడ్డి, చందుర్తి మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు ఏ. కమలాకర్ రావు, కోనరావుపేట మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు గోపు పరశురాములు, కొనరావుపేట మండలం రైతు బంధు సమితి కన్వీనర్ ప్రతాపరెడ్డి, వేములవాడ రూరల్ మండలం రైతు బంధు సమితి కన్వీనర్ కటకం మల్లేశం, మేడిపల్లి మండల సర్పంచులు వి నవీన్ రెడ్డి, సంపత్, వెంకట రమణా రావు, ఎంపిటిసిలు అజిత్ రావు ఎం తిరుపతి మకిలిదాస్, చీర్లవంచ ఎంపీటీసీ దేవరాజం, గోవిందారం ఎంపీటీసీ పూర్ణిమ ప్రభాకర్, కోఆప్షన్ సభ్యులు అహ్మద్, జమిలా, బబూన్, ఏ ఎం.సీ డైరెక్టర్లు దేవరాజం, పెండ్యాల శంకర్, బండారి శ్రీనివాస్, పశుల అంజి, పార్టీ నాయకులు పిట్టల వెంకటేష్, రవీందర్ రెడ్డి, రెడ్డవేని పరుశురాంలు పాల్గొన్నారు.



# డిసిసి కార్యాలయంలో ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి




కరీంనగర్, ఆగస్టు 20 (మనం న్యూస్)ః మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ ఇంచార్జ్, ఎఐసిసి సెక్రెటరీ క్రిస్టఫర్ తిలక్, మాజీ పార్లమెంట్ సభ్యులు పొన్నం ప్రభాకర్‌లు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా క్రిస్టఫర్ తిలక్ మాట్లాడుతూ డిజిటల్ టెక్నాలజీని తీసుకువచ్చిన రాజీవ్ గాంధీ చరిత్రలో నిలిచిపోతారన్నారు. డిజిటల్ టెక్నాలజీని దేశంలో ప్రవేశపెట్టిన మొదటి ప్రధాని రాజీవ్ గాంధీ అన్నారు. ఆయ తీసుకు వచ్చిన సాంకేతిక విప్లవంతో నేడు మన దేశం ప్రపంచ దేశాలతో పోటీ పడుతుందన్నారు. 73,74 రాజ్యాంగ సవరణల ద్వారా పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుకువచ్చి స్థానిక సంస్థలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించడం జరిగిందని అన్నారు. పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ దేశంలో సాంకేతిక విప్లవం తీసుకు వచ్చిన రాజీవ్ గాంధీని మర్చిపోవద్దన్నారు. 18 సంవత్సరా లకు యువతకు ఓటు హక్కు కల్పించి యువతకు ప్రాధాన్యతను కల్పించడం, పంచాయతీరాజ్ సంస్థలను బలోపేతం చేయడానికి 73,74 రాజ్యాంగ సవరణలు తీసుకవచ్చి, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు తీసుకురావడం లాంటివి చేపట్టిన ఘనత రాజీవ్ గాంధీదేనన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, పిసిసి కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్, నాయకులు రహమత్ హుస్సేన్, పడాల రాహుల్ గౌడ్ , ఎండి తాజ్ పులి ఆంజనేయులు గౌడ్ శ్రావణ్ నాయక్ కూస రవీందర్ అబ్దుల్ రెహమాన్ నాగి శేఖర్ మల్యాల సుజిత్ కుమార్ మడుపు మోహన్ శకుంతల అంతగిరి వినయ్ కుమార్ లింగంపల్లి బాబు కుర్రపోచయ్య కల్వల రామచంద్రం రామిడి రాజిరెడ్డి సలీముద్దీన్ నేహాలు బొబ్బిలి విక్టర్ అబ్దుల్ బారి హైమద్ సిరిపురం నాగప్రసాద్ వాసిం నూనె గోపాల్ రెడ్డి వంగల విద్యాసాగర్ పోరండ్ల రమేష్ లైక్ ఇమ్రాన్ పరదాల లింగమూర్తి మామిడి సత్యనారాయణ రెడ్డి బషీర్ జీలకర్ర రమేష్ మోసర్ల రామ్ రెడ్డి సర్వర్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం



తిమ్మాపూర్, ఆగస్టు 20 (మనం న్యూస్)ః కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పర్లపల్లి గ్రామంలో ఆదివారం శ్రీ భవాని చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలో పర్లపల్లి శ్రీ సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణుల చేతుల మీదుగా మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రా భిషేకాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ ఎల్ పి సెక్రటరీ మాదాడి రమేష్ రెడ్డి మంజుల దంపతులు, గ్రామ సర్పంచ్ మాదాడి భారతి నర్సింహా రెడ్డి, ఎంపిటిసి సభ్యులు ముప్పిడి సంపత్ రెడ్డి రమ, ఉప సర్పంచ్ సుద్దాల రాజేశ్, ఆలయ కమిటీ చైర్మన్ నగునూరి మధుసూదన్, శ్రీ సత్యసాయి సేవా సంస్థలు జిల్లా అధ్యక్షులు పాల్తపు లింగమూర్తి, రాష్ట్ర ప్రశాంతి నిలయం సేవల ఇంచార్జి యాదగిరి రావు, తెరాస నాయకులు రావ రాజు, భూమ మహేష్, బాగోతుల తిరుపతి, అంకతి వంశీ, ఆరేళ్ల ఎల్లయ్య గౌడ్, కొత్త వేంకటేశ్వర్లు, సోమ ల్ల శ్రీనివాస్, కామల్ల వేణు, జక్కుల మధు తో పాటు సత్యసాయి సమితి-భజన మండలి సభ్యులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## యూనివర్శిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరించాలి

రామగిరి,ఆగస్టు 20 మనం న్యూస్ ః తెలంగాణ రాష్ట్రంలోని యూనివర్శిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరించాలని కోరుతూ ఆదివారం హైదరాబాద్‌లో తలపెట్టిన సామూహిక సమర దీక్షకు మంథని జెఎన్టియు ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్స్ పెద్దసంఖ్యలో తరలివెళ్లారు.తెలంగాణలోని అన్ని యూనివర్శిటీలకు చెందిన 1445 మంది కాంట్రాక్టు అధ్యాపకులను రెగుల్యరైజ్ చేయాలని ఇందిరాపార్కులో సామూహిక సమరదీక్ష చేశారు. మంథని జెఎన్టియు కాంట్రాక్టు అధ్యాపకులు 40 మంది ఇందులో పాల్గొన్నారు. టీచర్స్ ఎమిలి అలుగుబెల్లి నర్సిరెడ్డి, సామాజిక, విద్యావేత్త ప్రొఫెసర్ వి.హరగోపాల్,రాజ్యసభ ఎంది ఆర్ కృష్ణయ్యలతో పాటు పలువురు మేధావులు దీక్షా శిబిరానికి విచ్చేసి సంఘీ భావం ప్రకటించారు. ప్రభుత్వం క్రమబద్ధీకరించని పక్షంలో సామూహిక సమ్మె చేస్తామని ఈ సందర్భంగా కాంట్రాక్టు అధ్యాపకులు హెచ్చరికలు చేశారు.



## ప్రజావాణి కార్యక్రమం మంగళవారంకు వాయిదా

## కలెక్టర్ హేమంత్ సహదేవరావు

కొమురంభీం ఆసిఫాబాద్, ఆగస్టు 20 (మనం న్యూస్)ః ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని అనివార్య కారణాల వల్ల ఈ మంగళవారం 21వ తేదీన నిర్వహించనున్నట్లు కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, దరఖాస్తుదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.